కొమ్మ తగిలితే.. కరెంట్ కట్!

- విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రం

మిర్యాలగూడ టౌన్ : విద్యుత్ సరఫరాలో చెట్ల కొమ్మలు ప్రతిబంధకంగా మారాయి. కరెంటు తీగలను ఆనుకొని ఉన్న కొమ్మలను ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బంది తొలగించాల్సి ఉన్నా తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో వర్షాకాలంలో వర్షాకాలం, గాలిదుమారం వచ్చినప్పుడు ఆ తీగలకు ఈ కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మున్సిపాలిటీలో చాలా వార్డులో ఇదే పరిస్థితి నెలకొంది. చిరుగాలి వీచినా, వానజల్లు కురిసినా కరెంటు సరఫరా నిలిపివేస్తున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్య వినియోగదారులకు తలనొప్పిని కలిగిస్తున్నాయి. గృహ అవసరాలకు సరఫరా చేస్తున్న విద్యుత్ తీగలకు అడ్డంకిగా మారి చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి అవరోధాలను కలగిస్తున్నారు. ఆ తరువాత సంబంధిత విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణ చేసి అడ్డుగా ఉంటున్న కొమ్మలను తొలగించాకా కానీ కరెంటు పునరుద్ధరణ కావడం లేదు. అప్పటి వరకు విద్యుత్ సరఫరా కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు అనివార్యం అవుతున్నాయి.


మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో చెట్ల మధ్యలో ఉన్న విద్యుత్ తీగలు

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది

చెట్ల కొమ్మలతో వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయాలు ఏర్పాడుతున్నాయి. వర్షం పడే సమయంలో విద్యుత్ అధికారులు ముందుగానే కరెంట్ తీసివేస్తున్నారు. రోజంతా వర్షం పడితే ఆ రోజు కరెంట్ సరఫరా చేయడం లేదు. దీంతో ఇళ్లలో కానీ, దుకాణాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు తీగలపై కొమ్మలు వాలడం, బలంగా పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రిప్ అయ్యే అవకాశం ఉంది. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే ప్రమాదమూ ఉంది. కొమ్మల దాటికి తీగలు కింద పడిపోయి ఒక్కసారిగా ప్రాణ నష్టం జరగొచ్చు. పశువులు, మానవులతో పాటు ఇతర జీవులకు ప్రాణ నష్టం జరిగితే పరిహారం రూపంలో మరింత అర్థిక భారం పడే అవకాశం ఉంది. కొమ్మల తొలగింపు విషయంలో విద్యుత్ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు.

చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాం

విద్యుత్ తీగలకు ఆనుకుంటున్నా చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగిస్తూనే ఉన్నాం. రోజు వారిగా ఒక్కొక్క ప్రాంతంలో నరికివేయిస్తున్నాం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే రీతిలో ఉన్న కొమ్మలను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపేడుత లేం. సమస్య ఉత్పన్నమవుతున్న ప్రతీ కొమ్మను తొలగిస్తున్నాం.

– ఐతగాని వెంకటేశ్వర్లు, డీఈ ట్రాన్స్‌కో మిర్యాలగూడ

తొలగింపు చర్యలు నామమాత్రమే



మున్సిపాలిటీలో ఏ వార్డులో చూసినా విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అనుకొని దర్శనమిస్తున్నాయి. పలు వార్డుల్లో చెట్ల మధ్యలోనే విద్యుత్ తీగలు వెళ్తుండటంతో వాటిని తొలగించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కరెంటు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చూడాలి.

– మేడి నవీన్, మిర్యాలగూడ

చదువుకు పేదరికం అడ్డుకాదు


రూప్లతండాలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న డాక్టర్ ఆనంద్

త్రిపురారం : చదువుకు పేదరికం అడ్డుకాదని, గ్రామీణ పాంతాల్లో తల్లిదండ్రులు పిల్లల చదువులపై నిర్లక్ష్యం చేయకుండా చదివించుకోవాలని బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని రూప్ల తండాలోని పాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఆనందర్ నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తండాల్లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఐదేళ్ల నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, ప్రధానోపాధ్యాయులు అశోక్, చిన్న గోపాల్, అంజన, గోవింద్ పాల్గొన్నారు.

దేవరకొండ జిల్లా ఏర్పాటు చేయాలని వినతి


ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొండమల్లేపల్లి : దేవరకొండ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని చిత్రియాల, పద్మట్‌పల్లి, మాల్‌ను మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. దేవరకొండ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంకూరి నర్సింహ, నక్క వెంకటేశ్వర్లు, వనం పుష్పలత, వనం జగదీశ్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చందునాయక్, సానగంటి రవిప్రసాద్, నేతాళ్ల వెంకటేశ్, వస్కుల సుధాకర్, ఆదిత్య, శ్రీశైలం, మహేశ్, చంద్రశేఖర్, ఆంజనేయులు, గణేశ్, ఆమునాయక్, మల్లేశ్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాతలకు సన్మానం


దాతలను సన్మానిస్తున్న మాలధారులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం మాలధారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలు దాసు లలిత, రవీందర్ దంపతులు, ఆలంపల్లి విజయ,ధనయ్య దంపతులతో పాటు జొరిగల మమత, మురళీ దంపతులను అయ్యప్ప మాలధారులు సన్మానించారు. అంతకుముందు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎంవీఎన్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఎంవీఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నల్లగొండ టౌన్ : మల్లు వెంకటనర్సింహారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు కార్యనిర్వహణ కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక సత్యవతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంవీఎన్ 19వ వర్ధంతి సందర్భంగా సత్యవతి ఆస్పత్రిలో ఉచిత మోకాలు చిప్పల శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య సేవలలోపాటు పోటీ పరీక్షల కోసం ఉచిత కోచింగ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. డాక్టర్ అరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇద్దరు పేద వారికి ఉచితంగా మోకాలి చిప్పల శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌మనోహర్, డాక్టర్ చైతన్య, సూరెపల్లి సత్యం, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం


సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపొంది మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలను మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేకల భద్రాద్రి, కంచి మధు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తల్లమల్ల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యన్నమల్ల అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చింతపల్లి లింగమయ్య, రేఖల సైదులు, యన్నమల్ల ప్రభాకర్, జయశంకర్, గాదరి రవి,గాలి నాగరాజు, తల్లమల్ల జనార్దన్, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ టౌన్ : నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ మంజులను అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎమ్మార్పీఎస్ నాయకుడు బకరం శ్రీనివాస్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అట్రాసిటీ కేసు పెట్టడంతోపాటు మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ఒకరికి ఉద్యోగం, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీఎల్ఆర్ తల్లి అస్థికల నిమజ్జనం

మిర్యాలగూడ : ఇటీవల మృతిచెందిన తన తల్లి వెంకట్రావమ్మ అస్థికలను ఎమ్మెల్యే బీఎల్ఆర్ దామరచర్ల మండలంలోని వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వర ఆలయం వద్దగల కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద శుక్రవారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు ఎండీ సద్దాం, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్ర విజ్ఞాన ప్రదర్శన


విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ బాలాజీ నాయక్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శుక్రవారం స్టూడెంట్ లెడ్‌కాన్ఫరెన్స్ పేరుతో ఐదో తరగతి లోపు విద్యార్థులు నిర్వహించిన శాస్త్ర విజ్ఞాన ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను శుక్రవారం మండల విద్యాధికారి ఎం. బాలాజీనాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనను తిలకించి నమునాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడంతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా కార్యదర్శి గాదే రవీందర్‌రెడ్డి, ఆదిత్య హైస్కూల్ కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, లిటిల్‌ఫ్లవర్ ప్రిన్సిపాల్ కెకె జయరాజన్, వైస్ ప్రిన్సిపల్ జీస్సీ జయరాజన్, బోధన సిబ్బంది వినీష్‌కుమార్, మధు నాయర్, శంకర్‌బాబు, రమేష్‌కుమార్, వినోద్ చంద్రన్, పద్మ, పద్మావతి, జ్యోతి, సరిత, మమత, నాగునాయక్‌లతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరువు భత్యం ఒకేసారి విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తాడిశెట్టి నరసింహ

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యం 10.72శాతం ఒకేసారి విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం దేవరకొండలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీని పెంచాలని కోరారు. హెల్త్ కార్డుపై అన్ని రకాల వ్యాధులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందజేయాలని కోరారు. అంతకుముందు దేవరకొండ ఎమ్మెల్యేగా గెలుపొందిన నేనావత్ బాలునాయక్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో పంగనూరి లింగయ్య, గంగిడి దామోదర్‌రెడ్డి, ఆకులపల్లి ఐజాక్, శాంతకుమారి, ఎండి.యూసుఫ్ షరీఫ్, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

హుజూర్‌నగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానం అని డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబూరావు అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన నాగమణికి డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేళ్లచెరువు ముక్కంటి బీ పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానవత్వంతో రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పి.నరసింహారావు, పి.బాలు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో వానరాల బీభత్సం

- పిల్లలు, మహిళలను గాయపరుస్తున్న కోతులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- నియంత్రించాలని వేడుకోలు


రెడ్డికాలనీలో రోడ్లపై సంచరిస్తున్న కోతులు

మిర్యాలగూడ టౌన్ :పట్టణ ప్రజలు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో కోతులు ఇళ్లపై, చెట్లపై దూకుడంతో పాటు రోడ్డుపై వెళ్లే పాదాచారులు, ద్విచక్రవాహనాదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన ప్రాంతాలైన ఎన్నెస్పీ క్యాంపు, శాంతినగర్, అశోక్‌నగర్, రెడ్డికాలనీ, ఇస్లాంపుర, సీతారాంపురం, రాంనగర్, షాబునగర్, హనుమాన్‌పేట, తాళ్లగడ్డ, ముత్తిరెడ్డికుంట, నాగార్జుననగర్, చైతన్యనగర్ కోతుల బెడద విపరీతంగా ఉంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ఇండోర్ స్టేడియం, మినీ రవీంద్రభారతి వద్ద రోడ్డుపై వెళ్లాలన్నా. రెడ్డికాలనీ నుంచి సాగర్‌కు వెళ్లాలన్న, ఏటీఎంల వద్దకు వెళ్లాలన్న భయం భయంతో వెళ్లాల్సిన వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

గోల్డెన్ ఐకాన్ అవార్డుకు హన్యానాయక్ ఎంపిక



మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుబ్బతండాకు చెందిన ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్‌ను న్యూఢిల్లీకి ఎకనామికల్ గ్రోత్ ఫౌండేషన్ గోల్డెన్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేసింది. హన్యానాయక్ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రతిని రిజిస్టర్ పోస్ట్ ద్వారా హన్యానాయక్‌కు పంపించారు. ఈ అవార్డుతో పాటు నోబుల్ సిటిజన్ గోల్డ్ మెడల్‌ను కూడా బహుకరించనున్నారు. ఈ అవార్డును ఈనెల 30వతేదీన అందజేయనున్నారు. ఈ సందర్భంగా హన్యానాయక్ మాట్లాడుతూ తాను చేసిన సేవకు ఫౌండేషన్ వారు గుర్తించి తనకు గోల్డెన్ ఐకాన్ అవార్డును ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

జీపీల్లో నిధులుంటేనే పనులు చేపట్టాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీల్లో నిధులు ఉంటేనే అభివృద్ధి పనులు చేపట్టాలని, జీపీల్లో ఉన్న నిధులను బట్టి అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సర్పంచ్‌లకు ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీపీల్లో నిధులు అందుబాటులో లేకపోయినా ఆయా గ్రామాల సర్పంచ్‌లు పనులు చేసి సంబంధిత బిల్లులు చెల్లించాలని కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తాగు నీటి విద్యుత్ మోటార్ల మరమ్మతులకు ఎక్కువ నిధులు డ్రా చేస్తున్నారని అన్నారు. నూతన ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమష్టిగా పని చేయాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ పనులు, పశువుల కొట్టాలకు సంబంధించిన పనులు, పారిశుద్ధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. కాగా, ఎంపీడీఓ శాంతకుమారి అడిషనల్ డీఆర్డీఓగా బదిలీపై మహబూబాబాద్‌కు వెళ్లడంతో ఎంపీఓ లావణ్యకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆమెకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, ఏపీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఈనెల 9 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఛాంబర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో మధ్యాహ్నం రెండుగంటల తరువాత ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత ప్రయాణంలో పల్లె వెలుగు బస్సు, ఎక్స్‌ప్రెస్‌ల్లో తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయణించవచ్చన్నారు. మహిళలతో పాటు థార్డ్ జండర్లకు కూడా ఉచితంగా ప్రయణించవచ్చన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఉచితంగా ప్రయాణించవచ్చాన్నారు.

నూతన భవనంలోకి సంఘమిత్ర బ్యాంకు


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ కిరణ్‌కుమార్

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గల నూతన భవనంలోకి శుక్రవారం సంఘమిత్ర బ్యాంకును మార్చారు. బ్యాంకును జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ సంగం రామకృష్ణ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఖాతాదారుల సేవే లక్ష్యంగా పనిచేస్తూ ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తున్నామన్నారు. బ్యాంకు ప్రతి ఏటా లాభాల బాటలో ముందుకు సాగుతోందన్నారు. మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక హంగులతో బ్యాంకును నూతన భవనంలోకి మార్చినట్లు తెలిపారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు శివకుమార్, విజయ్‌కుమార్, బ్యాంకు వైస్ చైర్మన్ పల్లాటి శైలజ, డైరెక్టర్లు పి.చక్రపాణి, పి.చండికేశ్వర్, జి.వెంకటేశ్వర్లు, ఎ.లక్ష్మయ్య, వై.శ్రీనివాస్‌రావు, మహ్మద్ షరీఫ్, సీఈఓ ఎండి.నజీరుద్దీన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత హస్తకళా మేళా ప్రారంభం


మేళాలో ఏర్పాటైన దుకాణాల్లో చీరలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మిర్యాలగూడ : పట్టణంలోని రెడ్డికాలనీలోగల సమ్మిడి వీరారెడ్డి కల్యాణమండపంలో శుక్రవారం చేనేత హస్తకళా మేళాను చేనేత హస్త కళాభారతి సొసైటీ అధ్యక్షుడు జిల్లా సత్యనారాయణ, కార్యదర్శి కిశోర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మంది చేనేత హస్త కళాకారులు తయారు చేసిన వస్త్రాలను, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆదరించాలని కోరారు. చేనేత వస్త్రాలు, వస్తువులు ఎంతో మన్నికగా ఉండడంతోపాటు అతి తక్కువ ధరకు లభిస్తున్నందున ప్రజలు ఆదరించి చేనేత హస్త కళాకారులకు చేయూతనందించాలనన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి, గద్వాల, కలంకారి వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు వచ్చి చేనేత హస్త కళా మేళాకు వచ్చి కొనుగోలు చేసి చేనేత కళాకారులను ఆదరించాలని కోరారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయడం హర్షణీయం

హుజూర్‌నగర్ : మలిదశ తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని పలువురు ఉద్యమకారులు అన్నారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో పలువురు ఉద్యమకారులు సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో తెలంగాణ ఉద్యమకారులందరిలో నూతన ఉత్సాహం వచ్చిందని అన్నారు.

తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి

మఠంపల్లి : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో 2022 జనవరి నుంచి 2023 మార్చి నెల వరకు చేపట్టిన పనులపై తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జానకిరాములు, ఏపీఓ ఉమాదేవి, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు బహుమతి అందజేత

నల్లగొండ: పట్టణంలోని 12వ వార్డు 51వ బూత్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ రావడంతో ఆ బూత్ కాంగ్రెస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి శుక్రవారం రూ.25 వేలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మామిడి కార్తిక్, పెరిక పుష్పలత తదితరులు పాల్గొన్నారు.